క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

నరసరావుపేట రూరల్: అల్లూరివారిపాలెం రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీ మంగళవారం నుంచి 7వ తేదీ గురువారం వరకు కాలభైరవ ప్రతిష్టా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రంగావఝుల కోటేశ్వర శాస్త్రి తెలిపారు. 7వ తేదీ ఉదయం 11.15 గంటలకు స్వామి వారి ప్రతిష్ట జరుగుతుందన్నారు. అనంతరం 12.30 గంటలకు శ్రీవల్లి, దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు.

659 నూతన పింఛన్లు మంజూరు

బొల్లాపల్లి: మండలంలో సెప్టెంబర్ నెలలో నూతనంగా 659 పింఛన్లు మంజూరయ్యాయని ఇన్‌చార్జి ఇఓపిఆర్‌డి జి. శ్రీహరి సోమవారం తెలిపారు. వీటిలో 473 నూతనంగా మంజూరైన పింఛన్లను వెరిఫికేషన్ అనంతరం లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. గతంలో 8351 మంది పింఛన్లు లబ్ధిపొందుతున్నట్లు తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళలు, డప్పు, చర్మ కళాకారులు, అభయహస్తం తదితర రకాల పింఛన్లు లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు చెప్పారు.

14న శ్రీ నారాయణీ ప్రత్యంగిరా హోమం

ఈపూరు: మండలంలోని కొండాయపాలెం శివారు బొగ్గరం గ్రామంలో ఈ నెల 14వ తేదీ సాయంత్రం 6గంటలకు కర్నూలు పట్టణానికి చెందిన పంతంగి లక్ష్మీ నారాయణశర్మ ఆధ్వర్యంలో శ్రీ నారాయణీ ప్రత్యంగిరా హోమం జరుగుతుందని నిర్వాహకులు, బొగ్గరం గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు.

నేడు ఉచిత నైపుణ్య శిక్షణపై అవగాహన


నరసరావుపేట రూరల్: మండల పరిషత్ కార్యాలయంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో మంగళవారం ఉచిత నైపుణ్య శిక్షణపై అవగాహన, నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కట్టా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్, ఇంజినీరింగ్‌లో మెకానికల్, ఐటీ, ఏరోనాటికల్, ఏరోస్పేస్‌లలో పట్టభద్రులై ఉండాలనితెలిపారు. మూడు నుంచి ఆరు నెలల శిక్షణా కాలం ఉంటుందన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పించబడుతుందని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, యూనిఫాం, స్టడీమెటీరియల్ అందిస్తామని వివరించారు.

బ్రహ్మానందంకు డాక్టర్ సినారే అవార్డ్



నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన బొగ్గారపు బ్రహ్మానందంకు హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 10న యామిని స్టూడియోస్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భాషా సంస్కృతికశాఖ సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్వర రాగ నీరాజనం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సీనారె అవార్డుతో సత్కరించనున్నారు. ఈమేరకు ఆహ్వానం అందినట్టు బ్రహ్మానందం సోమవారం తెలిపారు. విశ్వజనని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షునిగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో బ్రహ్మానందం అందించిన సాంస్కృతిక, సామాజిక సేవలకుగాను పురస్కారం అందించనున్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు



బొల్లాపల్లి: నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఎంపీపీ బత్తిరాములు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉన్నతి పథకంలో భాగంగా స్పైస్ టెక్నాలజీ నిర్వాహణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉన్నతి పథకంలో ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. అనంతరం ఉపాధి హామీ పథకం ఏపీఓ జీఎస్ ఆంజనేయరాజు మాట్లాడుతూ దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్యాయోజన ఆధ్వర్యంలో స్పైస్ టెక్నాలజీ నిర్వాహణలో నిరుద్యోగ యువతకు శిక్షణ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని పూర్తిచేయాలని, 18–35 ఏళ్ల వయసు కలిగి ఉండాలని, పదో తరగతి పాసై ఉండాలన్నారు. స్పైస్ టెక్నాలజీ నిర్వహణలో నిరుద్యోగ యువతకు ఆరు నెలల శిక్షణ ఉంటుందని, శిక్షణలో వసతి సౌకర్యాలతో పాటు స్టైఫండ్ ఉంటుందన్నారు. వీటిలో పలు రకాల అంశాల్లో శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పైస్ టెక్నాలజీ జెఆర్‌పీలు రామయ్య, పద్మావతి, వైష్ణవి పాల్గొన్నారు.

ఆలయానికి రూ.25 లక్షలు విరాళం



పట్టణ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణంలోని లాయర్‌స్ట్రీట్‌లో నివాసం ఉంటున్న అప్పరాజు సర్వమంగళ దేవి కుటుంబసభ్యులు రూ.25 లక్షలు ధ్వజ స్తంభం నిమిత్తం సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత సర్వమంగళ దేవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి దుశ్శాలువాతో సన్మానించి స్వామివారి మెమెంటోని అందజేశారు.

– వినుకొండ(నూజెండ్ల)

రీవెరిఫికేషన్...



ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు అర్హత కలిగి ఉన్న వారందరికి ఓటు హక్కు కల్పిస్తామని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజరు జి. వరలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని శానంపూడి, చినకంచర్ల, పిచికలపాలెం గ్రామాల్లో ఓటర్ల జాబితా రీవేరిఫికేషన్ నిర్వహించారు. వినుకొండ నియోజకవర్గంలో మరణాలు, డబుల్ ఎంట్రీలు, ఒకే బూత్‌లో రెండు ఓట్లు ఉండటం తదితరవన్నీ కలిపి 9 వేల ఓట్లు గతంలో బీఎల్‌వోలు తొలిగింపులు చేశారని, ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాను విచారణ చేశామన్నారు.

–శావల్యాపురం

క్విజ్ పోటీలు



పాలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో భారతీయ ప్రమాణాలుపై సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. మెంటార్‌గా శిక్షణ పొందిన బీవీహెచ్ రఘురామ్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవీ విజయకుమారి, నాదెండ్ల కేజీబీ పాఠశాల ఉపాధ్యాయినీ సి.హెచ్.వెంకటలక్ష్మిలు ముందుగా విద్యార్థులకు వివరించారు. అనంతరం జరిగిన క్విజ్ పోటీలో డి.సిరివెన్నల ప్రథమ బహుమతి, జె.భార్గవి ద్వితీయ బహుమతిని, కె.మనోజ్‌కుమార్ తృతీయ బహుమతి, కె.కావ్య నాల్గవ బహుమతిని సాధించారు. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతిని ఉపాధ్యాయులు అందజేశారు. –నరసరావుపేట

జగనన్న స్వచ్ఛ సంకల్పంపై..



ఐటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్ సంస్థల ఆధ్వర్యంలో నూజెండ్ల మండలంలోని జంగాలపల్లి గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా నీరు, పారిశుద్ధ్య కమిటీ హెచ్‌ఆర్‌డీ రమేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా జీవించాలంటే ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాలు, సామాజిక ఇంకుడు గుంతలు, మురుగునీరు నిర్వహణ తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కూచిపూడి చిన్న వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. –వినుకొండ(నూజెండ్ల)

ప్రతిపక్షాలకు పరాభవం తప్పదు

- చంద్రబాబును ప్రజలు తిరస్కరించడం ఖాయం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



గడప గడపకు కార్యక్రమంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: వచ్చే సాధారణ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని ప్రతిపక్ష పార్టీలతో కలిసి పోటీ చేసినా ప్రజలు తిరస్కరిస్తారని, సంక్షేమ పాలన అందిస్తున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డినేమరోదఫా ప్రజలు ఆశీర్వదిస్తారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గణపవరం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏడోరోజు నిర్వహించారు. మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు నివాసం నుంచి ప్రారంభమై బొడ్డురాయి మీదుగా ముప్వావారి బజారు, సినిమాహాల్ రోడ్డు వరకూ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ళ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలౌతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, యువతను పలకరిస్తూ ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలను వేధించారని గుర్తుచేశారు. ఏ సంక్షేమ పథకం అందాలన్నా పచ్చ కండువా కప్పుకుంటేనే అనే షరతు పెట్టి ముప్ప తిప్పలు పెట్టారన్నారు. టీడీపీ అరాచకాలను తట్టుకోలేక గత ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం వరకూ నెరవేర్చారని, ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ అధికారంలో అందరినీ భాగస్వామ్యం చేస్తూ ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ కార్యక్రమాలను ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయని, ఇదే వైసీపీ మెరుగైన పాలనకు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో 151 స్థానాలతో గెలుపు నందించిన ప్రజలు, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీని అజేయంగా నిలపాలని కోరారు. సుపరిపాలన, సంక్షేమ పథకాలు నిరంతరం సాగేందుకు ప్రజలు ఆశీస్సులందించాలని కోరారు.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, కౌన్సిలర్లు తులం సుధాకర్, పిల్లి సాగర్‌బాబు, షేక్ ఆదంవలి, నాలుగోవార్డు ఇన్‌చార్జి కాటా వెంకటేశ్వర్లు, నాదెండ్ల సొసైటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, నాయకులు గాలి బుచ్చయ్య, కాటా సూర్యనారాయణ, రత్తయ్య, ఆయిత శ్రీనివాసరావు, పెనుమల భీమయ్య, అనిశెట్టి కోటేశ్వరరావు, తాళ్లూరి ప్రభుదాసు, జెడ్పీ హైస్కూల్ పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్ నన్నెబోయిన శ్రీనివాసరావు, కొండెపాటి నాగయ్య, అవ్వారు సుబ్రహ్మణ్యం, ప్రసాద్, తలహాఖాన్, సొంగ వెంకటేష్, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బొప్పూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి పునరుజ్జీవం తెచ్చింది మహానేత రాజన్నే

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



అప్పారావు, సహచరులను కండువా కప్పి పార్టీలోకి చేర్చుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: వ్యవసాయానికి పునరుజ్జీవం తీసుకువచ్చింది మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని పరగటిచర్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు గుడిపూడి అప్పారావుతో పాటు సహచరులతో ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో ఆదివారం రాత్రి గ్రామ నాయకులతో కలిసి చేరారు. పార్టీలోకి వస్తున్న గుడిపూడి అప్పారావు, సహచరులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పార్టీ కండువాకప్పి చేర్చుకున్నారు. అట్టడుగు వర్గాల ఉన్నత చదువులు చదవాలని, ఫీజ్ రీయంబర్స్‌మెంట్‌కు శ్రీకారం చుట్టిన విద్యా ప్రదాత రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన సాగుతుందన్నారు. రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా లేకపోయినప్పటికీ సంక్షేమ పథకాల రూపంలో ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పేదవాడి ముఖంలో చిరునవ్వే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చేతులమీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కామినేని ఆదయ్య, మాజీ ఎంపీటీసీ కామినేని వెంకయ్య, రావి నరసింహారావు, సుబ్బారావు, బత్సు వెంకట్రావు, మందపాటి రమేష్, పగడాల వెంకయ్య, కుంబా బంగారయ్య, ముత్యాలంపాటి ఖాశిం, కందుల రామబ్రహ్మం, పోటూరి శ్రీనివాసరావు, చపారపు సంజీవరెడ్డి, వద్దుల సుబ్బారెడ్డి, బీరం భాస్కర్‌రెడ్డి, హనిమిరెడ్డి పాల్గొన్నారు.

రూరల్ సీఐగా కృష్ణయ్య



నరసరావుపేట రూరల్: రూరల్ సీఐగా పి.కృష్ణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాపట్ల జిల్లా బాపట్ల పట్టణ సీఐగా పనిచేస్తూ బదిలీపై నరసరావుపేటకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన భక్తవత్సలరెడ్డి ఒంగోలు రూరల్‌కు బదిలీపై వెళ్లిన విషయం విధితమే.

బొల్లాపల్లిలో భూ రీ సర్వే పనులు ప్రారంభం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్

బొల్లాపల్లి: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండల కేంద్రంలో రీసర్వేపై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ వి. సుధాకర్‌శర్మ మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా మండల కేంద్రంలోని భూములను రీసర్వే నేటి నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. రీ సర్వేకు రైతులు సహకరించాలన్నారు. ఈ రీ సర్వేలో భూ సరిహద్దు, హక్కు పత్రాలు ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని రైతులు సద్వినియోగపరచుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సుధాకర్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి గురవయ్య, సర్పంచ్ శిఖా జోత్స్న, మండల సర్వేయర్, జి.ఎస్. శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, వి.ఆర్.ఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి దాతృత్వం చాటుకున్న నడికట్టు

మోడల్ పాఠశాలలో మరమ్మతులకు రూ.6 లక్షల సొంత నిధులు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కొన్ని నెలలుగా చిరుమామిళ్లలోని ఏపీ మోడల్ పాఠశాలలో శానిటేషన్ సక్రమంగా లేకపోవటం, మరుగుదొడ్లు మరమ్మతులకు గురికావటంతో ఈ ఏడాది పాఠశాల పునః ప్రారంభం నుంచే చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాల హాస్టల్ పనిచేయటం లేదు. ఈ పాఠశాల 2013–14 విద్యా సంవత్సరంలో ప్రారంభమైంది. 2017 నుంచి మోడల్ పాఠశాలలో వంద మంది బాలికలతో వసతి గృహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

9,10 తరగతులతో పాటూ ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ సౌకర్యం వినియోగించుకోనున్నా రు. గతేడాది వేసవిలో సెప్టిక్ ట్యాంక్ కుంగిపోవటంతో పైపులైన్లు దెబ్బతిని శానిటేషన్ సౌకర్యం సక్రమంగా లేకపోవటంతో హాస్టల్‌ను నిలిపివేశారు. ప్రిన్సిపల్ ఝాన్సీవాణి, వార్డెన్‌ను ఉపాధ్యాయులు రామిరెడ్డికి సమస్యను వివరించారు.

దీంతో స్పందించిన ఆయన తన సొంత నిధులు రూ.6 లక్షలతో పూర్తిగా మరమ్మతులు చేయించారు. మంగళవారం వీటిని పునః ప్రారంభించనున్నారు. వచ్చే గురువారం నుంచి వంద మంది విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఝాన్సీవాణి తెలిపారు. సమస్యపై వెంటనే స్పందించిన నడికట్టు రామిరెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ప్రారంభమైన దేవాలయ ప్రతిష్ట

నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రేణుక అంకమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు రేణుకమ్మ తల్లి అమ్మవారిని చీరాల సముద్రానికి తరలించారు. సముద్ర స్నానం అనంతరం పొలిమేర వద్దకు తీసుకొచ్చి, అక్కడి నుంచి సాంప్రదాయబద్ధ మేళతాళాలతో శాలివాహన సంఘం సభ్యులు ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బొగ్గరం ఉప సర్పంచ్‌గా మొండితోక ఇస్సాక్

ఈపూరు: మండలంలోని బొగ్గరం గ్రామ ఉప సర్పంచ్‌గా మొండితోక ఇస్సాక్‌ను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో సర్పంచ్ పోట్లూరి హైమావతి, వార్డు మెంబర్లు గన్నవరం పుల్లారావు, పోట్లూరి అంజమ్మ, చింతా రాధిక, కందుకూరి మరియమ్మ, చెరుకూరి వెంకటనర్సయ్యలు కలిసి ఇస్సాక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఉపసర్పంచ్‌గా ఎన్నికైన ఇస్సాక్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

బొందిలిపాలెం ఉపసర్పంచ్‌గా చింతా విజయ్‌కుమార్

శావల్యాపురం: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు మండలంలోని బొందిలిపాలెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఉపసర్పంచ్ చింతా విజయ్‌కుమార్‌ను (అలియాస్ అంకమ్మ) (వైఎస్సార్ సీపీ అభ్యర్థి) ఎన్నుకోవటం జరిగింది. ఈసందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మండల పంచాయతీ అధికారి పి.సుగుణ నియామక పత్రాన్ని విజయ్‌కుమార్‌కు అందజేశారు. సర్పంచ్ బోడాల వీరాంజినేయులు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు, సచివాలయ కన్వీనర్ అల్లూరి వెంకటరావు,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్‌లు ప్రత్యేకంగా ఉప సర్పంచ్‌ను అభినందించారు.

కోట గ్రామంలో...

యడ్లపాడు: మండలంలోని కోట గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఎన్నిక ప్రక్రియ సోమవారం ముగిసింది. ఇటీవల కోట పంచాయతీ ఏడోవార్డు సభ్యురాలిగా ఏకగ్రీవమైన బోరుగడ్డ సరోజిని ఎంపికయ్యారు. అనంతరం ఈవోపీఆర్డీ వరూధిని చేతుల మీదుగా ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు.

జంగాలపల్లె ఉపసర్పంచ్‌గా ఉషారాణి

నాదెండ్ల: జంగాలపల్లె ఉపసర్పంచ్‌గా మూడో వార్డు సభ్యురాలు తిరుమలరెడ్డి ఉషారాణి సోమవారం ఎన్నికయ్యారు. ఇప్పటి వరకూ ఉపసర్పంచ్‌గా ఉన్న గాదె స్లీవారెడ్డి రాజీనామా చేశారు. దీంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల అధికారిగా ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ జంగాలపల్లె సచివాలయంలో ఎన్నిక నిర్వహించారు. 8 మంది వార్డు సభ్యులున్న ఈ గ్రామంలో మూడో వార్డు సభ్యురాలు ఉషారాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెలన్నర క్రితం సర్పంచ్‌గా ఉన్న బత్తుల సీతారామిరెడ్డి అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఉపసర్పంచ్‌తో పాటూ ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఉషారాణి వ్యవహరించనున్నారు. ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తిరుమలరెడ్డి లూర్ధురెడ్డి, ఏసురత్నం, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మీ, తిరుమలరెడ్డి చిన్నపరెడ్డి ఉన్నారు.

పాల ఉత్పత్తి పెంపే లక్ష్యంగా ప్రభుత్వ తోడ్పాటు

జగనన్న పాలవెల్లువ రుణమేళ కార్యక్రమం

యడ్లపాడు: పాల ఉత్పత్తి పెంపుదల కోసం పశువుల కొనుగోలుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు చేయూతనిస్తోందని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. మండలంలోని సొలస, లింగారావుపాలెం, యడ్లపాడు గ్రామాల్లోని జగనన్న పాలువెల్లువ కేంద్రాల్లో సోమవారం రాత్రి రుణమేళ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.రామారావు పాల్గొని పాల వెల్లువ కార్యక్రమం వివరాలు, సభ్యులకు చేకూరుతున్న లాభాలను, అలాగే పాల ఉత్పత్తి కోసం ప్రభుత్వం వివిధ బ్యాంకుల ద్వారా అందిస్తున్న గేదెల కొనుగోలు విషయాలను ఆయన వివరించారు. ప్రైవేటు డైరీలకు కేంద్రంలో పాలు పోసిన రైతులకు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం జీవన్, సొసల పశువైద్యాధికారి పి.రోజర్‌బెన్నీ, గ్రామ సర్పంచ్ కారుచోల హేమ, సీసీ జి నాగేశ్వరరావు, రూట్ ఇంచార్జి అంజమ్మ, మూడు కేంద్రాల్లోని లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై...

వినుకొండ(నూజెండ్ల) : నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం 15వ విడత సోషల్ ఆడిట్‌పై ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్స్, డీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వీరభద్రాచారి పాల్గొని మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రికార్డ్స్ ఆడిట్ టీం వారికి అందజేయాలని, ఆడిట్ టీం వారు కూడా రికార్డ్స్ తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో కట్టా నాగేశ్వరరావు, డీఆర్‌పీలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

393 మందికి నూతన పింఛన్లు

శావల్యాపురం: వైఎస్సార్ సామాజిక పింఛన్లు మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో 393 మంది లబ్ధిదారులు అర్హత పొందినట్లు ఎంపీడీవో పి.సీతారామయ్య సోమవారం తెలిపారు. మొదట విడతలో 156 మంది లబ్ధిదారులు మంజూరు కాగా నగదు అందజేశామని, రెండవ విడతలో 237 మంది లబ్ధిదారులకు ఎంపిక కాగా వీరందరికీ ఈనెల 7వ తేదీ లోగా పింఛను నగదు ఆయా గ్రామాల్లోని వలంటీర్లు పంపిణీ చేస్తారన్నారు.

నేడు అవగాహన సదస్సు

వినుకొండ(నూజెండ్ల) : డ్వామా పీడీ ఆదేశాల మేరకు నూజెండ్ల ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు స్కిల్ డెవలప్‌మెంట్ ఉన్నతి కార్యక్రమంపై నిరుద్యోగ యువతీ యువకులకు అవగాహన, నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో 18 నుంచి 35 సంవత్సరాల డ్రాప్ ఔట్‌లు, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదువు పూర్తి చేసుకున్న వారికి శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం చూపబడుతుందని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్ వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. 90 శాతం హాజరు ఉన్న వారికి రోజుకు రూ.272 రూపాయల లెక్కన పూర్తి శిక్షణ అనంతరం ఇవ్వడం జరుగుతుందన్నారు.